క్లుప్తంగా

రక్తదానం.. ప్రాణదానం



రక్తదానం చేసిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి సకాలంలో రక్తం అందుబాటులో లేకపోవడంతో అనేక మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ప్రమాదాల్లో గాయపడ్డవారిని ఆదుకోవడానికి రక్తదానం ఎంతో అవసరమని భీమవరం ఆదిత్య డిగ్రీ కళాశాల డైరెక్టర్ ఎం.శ్రీనివాస్, ప్రిన్సిపల్ ఎ. అనురాధ అన్నారు. మంగళవారం నేషనల్ వలంటరీ బ్లడ్ డొనేషన్ డే పురష్కరించుకొని విద్యార్థులు రక్తదానం చేశారు. ఏఎస్ఎన్ రాజు బ్లడ్‌బ్యాంక్‌కు 50 యూనిట్ల రక్తాన్ని అందచేశారు. అనంతరం రక్తదానం చేసిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ మావుల్లు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బ్రహ్మం, ఏవో సురేష్, తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయాల సాధనకు కృషి చేయాలి



పెద అమిరం ఎంజీఎం ట్రస్ట్‌లో విద్యార్థులతో ఆంధ్ర రాష్ట్ర గాంధీ స్మారక సంఘ సభ్యులు

కాళ్ల: గాంధీజీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆంధ్ర రాష్ట్ర గాంధీ స్మారక చైర్మన్ డాక్టర్ గాంధీ అన్నారు. పెదఅమిరంలోని మహాత్మా గాంధీ ట్రస్ట్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. గాంధీ జయంత్యుత్సవాల్లో భాగంగా ట్రస్ట్‌ను సందర్శించడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పద్మశ్రీ డాక్టర్ ఎంఆర్.రాజును సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గాంధీతో పాటు వై రామచంద్రరావు, ఇందుకూరి ప్రసాదరాజు, ఎంజీఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు, కస్తూర్బా సేవా సంస్థ సంఘ సభ్యులకు ప్రశంస పత్రాలు, నగదు బహుమతిని అందజేశారు.

ఆకివీడు ఎక్సైజ్ సీఐగా ఎం.శ్రీనివాసరావు



సీఐ ఎం.శ్రీనివాసరావు

ఆకివీడు: ఆకివీడు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎం.శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ నుంచి బదిలీపై వచ్చారు. ప్రస్తుతం పనిచేస్తున్న సీఐ కాత్యాయనీ దేవి అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటకు బదిలీ అయ్యారు.

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ తగదు



ప్రకాశంచౌక్ సెంటర్‌లో నిరసన దీక్ష చేస్తున్న సీఐటీయూ నాయకులు

భీమవరం: విశాఖ ఉక్కు విషయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మోసగిస్తున్నాయని విశాఖ ఉక్కు కోసం మరో పోరాటం తప్పదని కార్మిక, రైతు, వ్యవసాయ, విద్యార్థి, యువజన మహిళా సంఘాలు పిలుపునిచ్చాయి. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను నిరసిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం భీమవరం ప్రకాశం చౌక్ సెంటర్‌లో చేపట్టిన నిరసన దీక్షల్లో పలువురు వక్తలు మాట్లాడారు. నిరసన దీక్షా కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు అధ్యక్షత వహించగా, అంకెం సీతారాం, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఉచిత న్యాయ సహాయం



మాట్లాడుతున్న జడ్జి ధనరాజు

భీమవరం: వయో వృద్ధులకు న్యాయపరమైన సలహాలు అవసరమైతే మండల న్యాయ సేవా సంస్థ తరపున ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేసి, న్యాయం జరిగేలా చూస్తామని భీమవరం రెండో అదనపు జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.ధనరాజు అన్నారు. మంగళవారం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా తాడేరు రోడ్డులో వృద్ధాశ్రమాన్ని న్యాయమూర్తి ధనరాజు సందర్శించిన సందర్భంగా మాట్లాడారు. తల్లిదండ్రులను పట్టించుకోని పిల్లలకు తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తులను అనుభవించే హక్కు లేదని బిడ్డల నుంచి తల్లిదండ్రులు మనోవర్తి పొందొచ్చన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్, ప్రధాన కార్యదర్శి అడపాల ప్రసన్న కుమార్, మేళం దుర్గా ప్రసాద్, ప్యానల్ న్యాయవాదులు ఎస్.సుధీర్, పి.అంబేడ్కర్, డి.రవికిరణ్, ఎంబీ భవాని, కె.జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ ప్రాంగణాల్లో 'స్వచ్ఛత' శూన్యం

- దుర్గంధం వ్యాపించి ప్రయాణికుల అవస్థ
- పట్టించుకోని అధికారులు





ఆకివీడు రైల్వే స్టేషన్ ప్రాంగణంలో అధ్వానంగా ఉన్న పరిసరాలు

ఆకివీడు: అపరిశుభ్రతకు నిలయంగా రైల్వే ప్రాంగణం ఉంది. స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలోని సిద్ధాపురం గేటు వద్ద నుంచి దుంపగడప గేటు వరకూ రైల్వే ప్రాంగణం అపరిశుభ్రతతో పేరుకుపోయింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుజేస్తున్న స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం ఇక్కడ కానరావడం లేదు. సిద్ధాపురం గేటు వద్ద నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గం పూర్తిగా చెత్త చెదారంతో నిండి ఉంది. ఆయా ప్రాంతాల్లో వ్యర్థాలు పారబోయడం వల్ల ప్రజలకు, ప్రయాణీకులకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతుంది. ముక్కులు మూసుకుని రైల్వే స్టేషన్‌కు రావలసిన దుస్థితి ఏర్పడింది. క్యాబిన్ రోడ్డు, గూడ్స్ రోడ్డు మధ్య విపరీతంగా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. స్టేషన్ ప్రాంతంలోని చేపల బాక్సులు ఎగుమతి చేసే ప్రదేశాల వద్ద, రోడ్డు మార్గం గుంతలుగా ఏర్పడి మురుగు నిల్వ ఉంది. స్టేషన్ వద్ద డ్రెయిన్ పూడుకుపోవడంతో కొద్దిపాటి వర్షానికే సైకిల్ స్టాండ్ ప్రాంతం మునుగుతోంది. దుంపగడప గేటు వద్ద నుంచి రైల్వే స్టేషన్ వరకూ మధ్య ఉన్న ప్రాంతంలో వర్షం నీరు నిల్వ ఉంటోంది. ఆయా ప్రాంతంలో పిచ్చిమొక్కలు కుళ్లిపోవడం, వ్యర్థనీరు నిండిపోవడంతో దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు, ప్రయాణికులు వాపోతున్నారు. దుంపగడప గేటు సమీపంలోని ప్లాట్ పారం వద్ద అపరిశుభ్రత నెలకొని దుర్గంధం వ్యాపిస్తోంది. ఇక్కడ ప్రయాణికులకు దోమల దండయాత్ర తప్పడంలేదు. ప్లాట్‌ఫారంలపై ఫాగింగ్ చేసి దోమల బెడదను తొలగించాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు. మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ కార్యక్రమం చేపట్టి స్టేషన్ ప్రాంగణంలోని పార్కు ప్రాంతంలో ఉన్న పిచ్చిమొక్కల్ని విద్యార్థులు పీకివేశారు. విద్యార్థులను ఎండలో ఇటువంటి పనులు చేయించడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పొదల్లో పాములుంటాయని, విద్యార్థులు ఉత్సాహంగా వెళ్లడం వల్ల ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి



భీమవరం: చెకుముకి సైన్స్ సంబరాల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



కాళ్ల : బహుమతులు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు



ఉండి: జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు ఎంపికైన విద్యార్థులు

కాళ్ల: ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాళ్ల ప్రధాన ఉపాధ్యాయులు జేఎల్ఎన్ శాస్త్రి అన్నారు. జన విజ్ఞాన వేదిక, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబరాల్లో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ మండల స్థాయి చెకుముకి టెస్టుకు కాళ్ల జిల్లా పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాళ్ల మండల పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ప్రైవేటు ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోపల్లె విద్యార్థులు లిఖిత దుర్గ, యశస్విని, భార్గవ ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ప్రథమ స్థానాన్ని, వెస్ట్ బెర్రీ ఉన్నత పాఠశాల విద్యార్థులు శ్రీకర్, బలరామకృష్ణ, షణ్ముఖ వర్మ ప్రైవేటు పాఠశాల విభాగంలో ప్రథమ స్థానాన్ని పొందినట్లు చెకుముకి మండల కన్వీనర్ బొబ్బిలి రాజమౌళి కోటేశ్వర స్వామి తెలియజేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు స్వామి మాస్టారు సౌజన్యంతో జ్ఞాపికలను అతిథుల చేతుల మీదుగా ప్రదానం చేశారు. యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శిఎం శంకర్ ఉపాధ్యాయులు ధర్మరాజు, కిషోర్ కుమార్, ప్రసాద్, విజయ్ కుమార్, పాల్గొన్నారు.

జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్‌టెస్ట్‌కు ఎంపిక

ఉండి: జిల్లాస్థాయి చెకుముఖి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కి మండల విద్యార్థులు ఎంపికైనట్లు జనవిజ్ఞాన వేదిక మండల కన్వీనర్ గోపాలసుకుమార్ తెలిపారు. మంగళవారం ఉండి జెడ్పీ హైస్కూల్లో జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక ప్రక్రియలో నిర్వహించిన పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాల విభాగంలో చెరుకువాడ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచి జిల్లాస్థాయికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ప్రైవేటు స్కూల్స్ విభాగంలో ఉండి డిజిటల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులకు ప్రసంశా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఉండి జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం రామలక్ష్మీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అట్టహాసంగా చెకుముకి సైన్స్ సంబరాలు ప్రారంభం

భీమవరం: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భీమవరం పట్టణ, మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు పట్టణంలోని చింతలపాటి బాపిరాజు మెమోరియల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం డీఎన్నార్ కళాశాల జాయింట్ సెక్రటరీ కూనపరాజు రామకృష్ణంరాజు ప్రారంభించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు చింతపల్లి ప్రసాదరావు మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి సైన్స్ పట్ల అభిరుచిని కలిగించడానికి గత 34 ఏళ్లుగా వేదిక రాష్ట్ర వ్యాప్తంగా చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తుందన్నారు. చెకుముకి సంబరాల్లో విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా కార్యదర్శి అలుగు జాన్సన్, భీమవరం చెకుముకి సైన్స్ సంబరాల కన్వీనర్లు ఎ.లోకేశ్వరరావు, ఎం.సోమేశ్వరరావు, గోపాలరాజు, శేఖర్‌రాజు, రామభద్రరాజు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

ఆకివీడు: విద్యార్థులు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని శాస్త్రవేత్తలుగా ఎదగాలని ప్రధానోపాధ్యాయులు తోట పోతరాజు పిలుపునిచ్చారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ పోటీలు మండల స్థాయిలో స్థానిక జెడ్పీ స్కూల్లో మంగళవారం నిర్వహించారు. పోటీల్లో 7 ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలల నుంచి ముగ్గురు విద్యార్థుల బృందం పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో ప్రథమ స్థానంలో పీఎల్ఎస్ జెడ్పీ స్కూల్ ఆకివీడు బృందం, ప్రైవేటు పాఠశాలలో విజ్ఞాన్ స్కూల్ విద్యార్థుల బృందం నిలిచారు. ఈ నెల 27న తాడేపల్లిగూడెంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఉపాధ్యాయులు ముత్యాల వెంకటస్వామి, అగ్నిహోత్రం రామ శేషుబాబు, విజయ్‌కుమార్, డీవీ.మోహన్‌రావు, అమృతలూరు రాంగోపాల్, చెకుముకి సైన్స్ పరీక్ష నిర్వాహకులు తాలాడి వెంకటేశ్వరరావు, ఎండీ.షహజాద్ పాల్గొన్నారు.

ఇసుక కొరతతో ఉపాధి కరువు



ఎమ్మెల్యే అంజిబాబుకు వినతి పత్రం అందిస్తున్న తాపీ పని వార్ల యూనియన్ నాయకులు

భీమవరం: ఇసుక కొరత కారణంగా భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఇసుక పొందడానికి ఆన్‌లైన్ బుకింగ్‌కు వెబ్‌సైట్ పగలు ఓపెన్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని భీమవరం తాలూకా తాపీ పని వార్ల యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మెర్ల సత్యనారాయణ, కటకంశెట్టి ఏడుకొండలు కోరారు. మంగళవారం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు)ను క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇసుకను 5 యూనిట్లు బ్లాక్‌లో రూ.30 వేలకు అమ్ముతున్నారని దీంతో గృహాలు నిర్మించుకునే యజమానులు పనులు చేయించడానికి ముందుకు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు సంఘం నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు అగ్రహారం విద్యార్థులు



రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఉండి: రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికై స్కూల్‌కు, తల్లిదండ్రులకు మంచిపేరు తెచ్చిన విద్యార్థులను హృదయపూర్వకంగా అభినందిస్తున్నట్లు ఎన్నార్పీ అగ్రహారం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఏవీ సత్యనారాయణ మంగళవారం తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయిలో గత నెల 30న ఏలూరు ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీల్లో ఎన్నార్పీ అగ్రహారం జెడ్పీ హైస్కూల్ నుంచి అండర్ 17 జట్టుకు ఐదుగురు విద్యార్థులు ఎం శ్యామ్‌కుమార్, కే మహాలక్ష్మీ, ఎల్‌జే ప్రతిభ, పీ సురేఖ, పి చంద్రశేఖర్‌నాయుడు ఎంపికయ్యారు. వీరిలో బాలుర జట్టు ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు రాజమండ్రిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టుకు ప్రతినిధ్యం వహిస్తారని తెలిపారు. అండర్ 17 బాలికల జట్టు త్వరలోనే ఎన్టీఆర్ జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారిని అభినందించారు.

వరి పైరుపై మూషిక దాడి ఉధృతం



స్థానిక మాదివాడలో ఎలుక కొట్టుడుతో ధ్వంసమైన వరి దుబ్బులు



చినమిల్లిపాడులో పొలం పిలుస్తోందిలో రైతులు

ఆకివీడు: భారీ వర్షాలు, వరదల తాకిడికి తట్టుకుని నిలబడిన వరి పైరును తెగుళ్లు ఆశిస్తున్నాయి. మండలంలో భారీ వర్షాలకు, వరదలకు 85 శాతం మేర వరి పంట నీటి పాలైంది. కొంతమేర వరద నీటిలో కుళ్లిపోయింది. మిగిలిన పైరును ఎలుకలు ధ్వంసం చేస్తున్నాయి. అక్కడక్కడ వరిపైరుపై ఎండాకు, నల్లి తెగుళ్లు కనిపిస్తున్నాయి. సామూహికంగా ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపట్టినప్పటికీ ఫలితం దక్కడంలేదు. వరి చేలల్లో నీరు అధికంగా ఉండటంతో గట్లపై బొరియలు ఏర్పాటు చేసుకుని ఎలుకలు విజృంభిస్తున్నాయని రైతులు వాపోతున్నారు. రైతులు ఎలుకల నిర్మూలనకు బ్రొమోడైన్ మందును నూకలు, నూనె కలిపి బొరియల్లో పలు పర్యాయాలు ఉంచాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఎండాకు తెగులు నివారణకు ట్రిబేసిక్ కాపర్ సల్ఫేట్ 34.5 శాతం ఉన్న మందును ఎకరాకు 400 మి.లీటర్లు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయించాలన్నారు. ప్లాంటోమైసిన్ మందు 200 గ్రాములు ఎకరాకు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఎంటీయూ 1318,1121 రకం పైరుకు ఆకు ఎండు తెగులు సహజంగా వస్తుందని, నత్రజని వాడకాన్ని నిలుపుదల చేయాలని సూచించారు. 20 కేజీలు పొటాష్ వాడాలని ఏడీఏ కె.శ్రీనివాసరావు చెప్పారు.

వరిని రక్షించుకుందాం

ఆకివీడు: వరదలు, భారీ వర్షాలను తట్టుకుని బతికిన వరి పైరును రక్షించుకునే ప్రయత్నాల్ని రైతులు చేపట్టాలని మండల వ్యవసాయాధికారిణి ఎం.ప్రియాంక పిలుపునిచ్చారు. మండలంలోని కొల్లేరు తీరంలోని చినమిల్లిపాడులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి పొలాల్లోని వరద నీటి తీసి వేసి కొత్త నీటిని నింపాలన్నారు. పొలంలో నత్రజని ఎరువు వాడవద్దని, పొటాష్ ఎరువు 20 కేజీలు చల్లాలన్నారు. తెగుళ్లు ఆశించకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు.

సస్య రక్షణతో అధిక దిగుబడులు

భీమవరం అర్బన్: వరిలో సస్యరక్షణ చేపడితే అధిక దిగుబడులు సాధించొచ్చని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని తుందుర్రులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు ఉదయాన్నే పొలం చుట్టూ తిరిగితే పైరుపై ఆశించిన తెగులును గుర్తించి ఆదిలోనే నివారణ చర్యలు చేపట్టొచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరేటి పెద్దబ్బు, ఎంపీటీసీ వాసు, రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



స్థానిక లయన్స్ కార్యాలయంలో వృద్ధులకు దుప్పట్లు, మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆకివీడు: పుష్కర కాలంగా వృద్ధులకు సేవలందించడం హర్షణీయమని తహసీల్దార్ ఎస్. వెంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ కార్యాలయంలో మంగళవారం వృద్ధులకు దుప్పట్లు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తహసీల్దార్ పాల్గొన్నారు. స్థానిక వైద్యులు డాక్టర్ నవీన్, కవితల ఆర్థిక సహకారంతో ఈ రోజు 140మందికి దుప్పట్లు, మందులు అందజేసినట్లు సంఘ కార్యదర్శి బొబ్బిలి బంగారయ్య చెప్పారు. కార్యక్రమానికి సంఘ గౌరవాధ్యక్షుడు ఎంవీ.సూర్యనారాయణరాజు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు ఆర్వీ. సూర్యనారాయణరాజు, పల్లి అప్పిరెడ్డి, గొంట్లా కృష్ణ, క్లబ్‌ల అధ్యక్షులు నరశింహం, ఎండీ.జక్కీ, నగర పంచాయతీ వైస్ చైర్మన్ పుప్పాల పండు, మోరా జ్యోతిరెడ్డి పాల్గొన్నారు.

వృద్ధులపై ఆదరణ చూపాలి

ఉండి: సమాజంలోని ప్రతి ఒక్కరూ వృద్ధులను ఆదరించి, గౌరవించాలని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మండల కార్యదర్శి గాదిరాజు రంగరాజు అన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండలంలోని ఉప్పులూరులో వృద్ధులను సేవా సంస్థ ఆధ్వర్యంలో సత్కరించారు. సంస్థ మండలాధ్యక్షుడు పెన్మత్స రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ మండల చైర్మన్ దంగేటి రామలింగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు యర్రా విక్రమ్, గంధం తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సంరక్షణ చట్టం అమలు చేయాలి



తహసీల్దార్ రాంబాబుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భీమవరం: తల్లిదండ్రుల పోషణ సంరక్షణ చట్టం -2007 చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించాయని భీమవరం వృద్ధుల సంక్షేమ సంఘం నాయకులు మట్లపూడి సత్యనారాయణ, బోనం పాండురంగారావు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ఆర్.రాంబాబుకు అందజేశారు. కార్యక్రమంలో తాళ్లపూడి గాంధీ, చినిమిల్లి నాయుడు, పెన్మెత్స రామకృష్ణంరాజు, ఇంటి లక్ష్మణరావు, కడియం ఈశ్వరరావు, పేరిచర్ల లక్ష్మణ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

కొట్టి గాయపరచిన వ్యక్తిపై కేసు నమోదు

భీమవరం అర్బన్: రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం అన్యాయంగా కొట్టి గాయపరిచారని వ్యక్తి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కొవ్వాడ అన్నవరం గ్రామానికి చెందిన తాళ్లూరి దినేష్‌ను గత నెల 29న అదే గ్రామానికి చెందిన తాళ్లూరి ఆనందబాబు, తాళ్లూరి జెస్సీ కొట్టి గాయపరిచారు. బాధితుడు దినేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహంపై దాడి

భీమవరం అర్బన్: రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం సీఐ బంటుమిల్లి శ్రీనివాస్ సిబ్బందితో వ్యభిచారం గృహంపై దాడి చేసి, నిర్వాహకులైన భార్యా భర్తలను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొవ్వాడ పుంతలో అల్బెర్ట్ సెల్వకని తన భార్య వెంకటలక్ష్మి వ్యభిచార గృహం నిర్వహిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న సీఐ బంటుమిల్లి శ్రీనివాస్ సిబ్బందితో దాడి చేసి, భార్యాభర్తలను అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించారు. బాధిత మహిళను విజయవాడ హోమ్‌కు తరలించినట్లు సీఐ బంటుమిల్లి శ్రీనివాస్ తెలిపారు.

అదనపు కట్నం కేసు నమోదు

భీమవరం అర్బన్: రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్తపై భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దిరుసుమర్రుకు చెందిన దొంగ లక్ష్మీదుర్గకు కృష్ణమోహన్‌కు 15 ఏళ్ల క్రితం వివాహమైంది. అదనపు కట్నం కోసం దొంగ లక్ష్మీ దుర్గను భర్త కృష్ణమోహన్, అత్త, మామలు వేధిస్తున్నారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇన్‌చార్జి ఎస్సై ఐ.వీర్రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మవార్ల ఆలయం వద్ద అన్నసమారాధన

ఆకివీడు: వినాయక చవితి ఉత్సవాలు ముగింపు సందర్భంగా మంగళవారం స్థానిక మాదివాడలోని గంగానమ్మ, మద్దిరావమ్మ అమ్మవార్ల ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. మాదివాడ యూత్ ఆధ్వర్యంలో యువకులు ఉత్సాహంగా వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించారు. అన్న సమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు.

బాలాత్రిపుర సుందరీదేవికి కుంకుమ పూజలు

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక మెంటేవారి తోటలోని శ్రీవిజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాలాత్రిపుర సుందరీదేవి దేవస్థానంలో వేద మంత్రాలతో సంప్రదాయ బద్ధంగా సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మద్దాల సత్యనారాయణ, లక్ష్మి బ్రాహ్మజి దంపతులతో అమ్మవారికి ప్రత్యేక పూజలు కుంకుమ పూజలు, లక్ష్మి గణపతి హోమం, సంప్రోక్షణ నిర్వహించారు. 3 నుంచి 12 వరకు దేవి శరన్నవరాత్రి మహోత్సవాలను నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ తెలిపింది.

నేటి నుంచి గ్రామ సభలు

ఉండి: గ్రామీణ ఉపాధి హామీ పనుల గుర్తింపు, అంచనాలు, విలువలు తయారు చేసేందుకు ప్రభుత్వాదేశానుసారం 2వ తేదీ బుధవారం నుంచి 31వ తేదీ గురువారం వరకు మండలంలోని 19 గ్రామాల్లో రెండు దఫాలుగా గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్ రవీంద్ర తెలిపారు. ఈ నెల 2న ఉదయం 10.30 గంటల నుంచి అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి రెండవ దఫా గ్రామ సభలు ప్రతి గ్రామంలోనూ ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహిస్తామని ఎంపీడీవో తెలిపారు.

వరద బాధితులకు విరాళం

భీమవరం (ప్రకాశంచౌక్): విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి ఆచంట మండలంలోని ప్రజలు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ రూ.3,00,232 విరాళాలు సేకరించారు. దీనికి సంబంధించిన చెక్కును కలెక్టరు చదలవాడ నాగరాణికి మండల తహసీల్దార్, సిబ్బంది చేతుల మీదుగా మంగళవారం కలెక్టరేట్‌లో అందజేశారు.

రేపటి నుంచి శృంగవృక్షం రైల్వే గేటు మూసివేత

పాలకోడేరు: పాలకొల్లు–భీమవరం రహదారిలోని శృంగవృక్షంలో రైల్వే గేటును మరమ్మతుల నిమిత్తం 5 రోజుల పాటు మూసి వేస్తామని దక్షిణ మధ్య రైల్వే భీమవరం సీనియర్ సెక్షన్ ఇంజినీర్ డి.ఆనందరావు తెలిపారు ఈ నెల 3వ తేదీ ఉదయం నుంచి 7వ తేదీ సాయంత్రం వరకు మూసి వేస్తామని తెలిపారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

భీమవరం (ప్రకాశంచౌక్): ఛాంబర్ ఆఫ్ కామర్స్ అసోసియేషన్ బిల్డింగ్‌లో దుకాణాల యజమానులకు సచివాలయ శానిటేషన్ సెక్రటరీలకు ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, పురపాలక సంఘ కమిషనర్ కె.రామచంద్రా రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర రావు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొండాడ రాంపండు, ఉపాధ్యక్షుడు తుమ్మలపల్లి శివ పాల్గొన్నారు. అక్టోబర్ 10 నుంచి పట్టణంలో సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలవుతుందని, వ్యాపారులు ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్ వస్తువులను విక్రయించరాదని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమవరం: ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వ్యక్తి గడ్డి మందు తాగి చనిపోయాడని భీమవరం వన్‌టౌన్ ఏఎస్సై రామకృష్ణ మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని నరసయ్య అగ్రహారానికి చెందిన కవాలి మణికంఠ(32) సోమవారం స్థానిక లెప్రసీకాలనీ వద్ద గడ్డి మందు తాగడంతో ఇది గమనించిన స్థానికులు అతడిని భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకోసం ఏలూరు తరలించగా, చికిత్స పొందుతూ చనిపోయాడని మృతుడి భార్య నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రామకృష్ణ తెలిపారు.

మోటార్ సైక్లిస్టుకు గాయాలు

ఉండి: ఎన్నార్పీ అగ్రహారం పరిధిలో జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు గాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ద్విచక్ర వాహనదారుడ్ని ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన ద్విచక్ర వాహనదారుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని పోలీసులు చెబుతున్నారు.